సమ్మర్ ఉత్సవ్ మేళా

● ఆకట్టుకుంటున్న కశ్మీర్ మంచుకొండల దృశ్యాలు



ప్రదర్శనలో ఏర్పాటైన ఎక్వేరియంలో చేపలను చూస్తున్న సందర్శకులు



కశ్మీర్ ప్రకృతి సోయగాలు

ఖైరతాబాద్, మే 22(ఆంధ్రజ్యోతి): ఎన్నో రోజులుగా నగరవాసులు ఎదురుచూస్తున్న సమ్మర్ ఉత్సవ్ మేళా బుధవారం ప్రారంభమైంది. ప్రతి ఏటా ఓ వైవిధ్యతతో తయారయ్యే ఈ మేళాలో ఈసారి చల్లటి కశ్మీర్‌లో విహరించిన అనుభూతి కలిగేలా చేసిన ఏర్పాట్లు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. మంచు పడుతున్న చలి నుంచి వెళ్తున్న అనుభూతి కలిగేలా ఏర్పాటైన టన్నెల్ మరింత ఆకట్టుకుంటోంది. దీంతో పాటు అమ్యూజ్‌మెంట్ రైడ్లు, పలు రాష్ట్రాల నుంచి వచ్చిన వర్తకులు తమ స్టాళ్ల ద్వారా ఎన్నో రకాల వస్తువులు, హ్యాండ్లూమ్, హ్యాండీక్రాఫ్ట్ వస్తువులను విక్రయానికి ఉంచారు. తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల తినుబండారాలతో కూడిన వాటిని ఆరగిస్తూ కుటుంబ సమేతంగా సందర్శకులు సమ్మర్ ఉత్సవ్ మేళాలో సందడి చేస్తున్నారు. ఐమాక్స్ పక్కనున్న హెచ్‌ఎండీఏ ఖాళీ ప్రదేశంలో ఈప్రదర్శన ప్రతిరోజూ మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు ఉంటుందని నిర్వాహకుడు మీర్జా రఫీక్‌బేగ్ తెలిపారు.

తాగిన మైకంలో ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య

అమీర్‌పేట, మే 22(ఆంధ్రజ్యోతి): తాగిన మైకంలో ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన ఎస్‌ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈస్ట్ శ్రీనివాస నగర్‌లో మంగళవారం రాత్రి జరిగింది. ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. అమీర్‌పేటలోని ఈస్ట్ శ్రీనివాస్ నగర్‌లో ఉంటున్న బాబా షరుద్దీన్‌కు 10 సంవత్సరాల క్రితం వివాహం కాగా, తరుచుగా ఇరువురి మధ్య గొడవలు జరుగుతుండడంతో భార్య వెళ్లిపోయింది. అప్పటి నుంచి పని పాట లేకుండా తల్లితండ్రుల వద్దనే ఉంటూ మద్యానికి బానిసయ్యాడు. మంగళవారం మద్యం తాగి ఇంటికొచ్చి పై పోర్షన్ వెళ్లే మెట్లపై ఉన్న పిల్లర్ దిమ్మెకు ప్లాస్టిక్ వైర్‌తో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రాత్రి ఒంటి గంట దాటినా ఇంటికి రాకపోవడంతో కంగారు పడ్డా కుటుంబ సభ్యులు కిందకొచ్చి చూడగా దిమ్మెకు వేలాడుతూ కనిపించాడు. వెంటనే 108కు సమాచారం అందించారు. ఇక్కడకు చేరుకున్న సిబ్బంది అప్పటికే మరణించినట్టు నిర్ధారించారు. తన చావుకు ఎవరూ కారణం కాదని జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకుంటున్నట్టు సూసైడ్ నోట్‌లో పేర్కొన్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు.

తల్లీకూతురు అదృశ్యం



ఖైరతాబాద్, మే 22(ఆంధ్రజ్యోతి): తల్లితో పాటు కూతురు అదృశ్యమయ్యారు. ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్ ఏఎస్‌ఐ శ్రీరాములు తెలిపిన వివరాల మేరకు... బంజారాహిల్స్ నంది నగర్‌కు చెందిన మహ్మద్ నవాజ్ తన ఆటోలో భార్య ఆయేషా బేగం(35)తో పాటు కూతురు సమ్రీన్(12)ను ఎక్కించుకొని ఈనెల 21 రాత్రి 8గంటల సమయంలో వెళ్తున్నారు. భార్యాభర్తల మధ్య ఉన్న గొడవలతో భార్య ఆటో ఖైరతాబాద్ ఫ్లైఓవర్ పైకి రాగానే రక్షించండి.. రక్షించండి అంటూ కేకలు వేయడంతో వాహనదారులు ఆటోను ఆపి భార్యా బిడ్డలను బయటకు పంపారు. అప్పటి నుంచి వారు ఇంటికి రాలేదని భర్త నవాజ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్‌ఐ తెలిపారు.

పంజాగుట్ట పీఎస్ వద్ద ద్విచక్రవాహనం దగ్ధం



దగ్ధమైన ద్విచక్రవాహనం

పంజాగుట్ట, మే 22(ఆంధ్రజ్యోతి): పంజాగుట్ట పోలీస్‌స్టేషన్ బయట పార్క్ చేసిన ద్విచక్రవాహనం అనుమానాస్పద స్థితిలో పూర్తిగా కాలిపోయింది. పక్కనే ఉన్న మరో ద్విచక్ర వాహనం కూడా పాక్షికంగా కాలిపోయింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అంబర్‌పేటకు చెందిన షేక్ ఖలీల్ పాషాకు టీఎస్11ఈజెడ్ 6257 నెంబర్ గల ద్విచక్రవాహనం ఉంది. అదే ప్రాంతానికి చెందిన సమీప బంధువు మహ్మద్ అమీర్ తన వ్యక్తిగత పనిమీద బోయిన్‌పల్లికి వెళ్లేందుకుగాను షేక్ ఖలీల్ పాషాకు చెందిన ద్విచక్రవాహనాన్ని తీసుకున్నాడు. బుధవారం మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో ద్విచక్రవాహనంపై మహ్మద్ అమీర్ పంజాగుట్ట పోలీస్ స్టేషన్ వద్దకొచ్చాడు. వాహనాన్ని పీఎస్ బయట పార్క్ చేసి కారులో వెళ్లిపోయాడు. నాలుగు గంటల ప్రాంతంలో పీఎస్ బయట నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనంలో ఒక్కసారిగా మంటలు వచ్చి పూర్తిగా కాలిపోయింది. వాహనం యజమాని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్‌ఐపై ఎస్సీఎస్టీ కమిషన్‌లో ఫిర్యాదు

● దంపతులను కాలితో తన్నిందని ఆరోపణ

హైదరాబాద్ సిటీ, మే 22(ఆంధ్రజ్యోతి): మధురానగర్ పోలీసుల తీరు వివాదాస్పదమైంది. స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్‌ఐ మాధవిపై ఎస్సీ ఎస్టీ కమిషన్‌తో పాటు.. వెస్టుజోన్ డీసీపీ విజయ్‌కుమార్‌కు బాధితులు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేయడానికి స్టేషన్‌కు వెళ్లిన దంపతులను కులంతో పేరుతో దూషించడంతో పాటు వారిపట్ల అనుచితంగా ప్రవర్తించి మహిళా బాధితురాలి ప్రైవేట్ పార్ట్స్‌పై కాలితో తన్ని అవమానించిందని బాధితులు బుధవారం ఎస్సీఎస్టీ కమిషన్‌ను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. వెస్టుజోన్ డీసీపీ విజ యక్‌కుమార్‌కు కంప్లైంట్ చేసినట్లు తెలిపారు. ఈనెల 17వ తేది రాత్రి 9గంటల ప్రాంతంలో ఎర్రోళ్ల రమేష్ మధురానగర్‌లోని మధురావైన్స్‌కు మద్యం కొనుగోలు చేసేందుకు వెళ్లాడు. అక్కడ డబ్బులు చెల్లించే విషయంలో వైన్‌షాపు సిబ్బందికి అతడికి వివాదం తలెత్తింది. దాంతో వైన్‌షాపు సిబ్బంది రమేష్‌ను కొట్టారు. ఈ విషయంపై ఫిర్యాదు చేసేందుకు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లగా ఆస్పత్రికి వెళ్లి గాయాలు చూపించి ఎమ్‌ఎల్‌సీ (మెడికోలీగల్ కేసు) తీసుకురమ్మని తెలిపారు. అందు కోసం ఎస్‌ఆర్ నగర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి రమేష్ భార్య సాజిదాబేగం వెళ్లారు. ఈలోపు కానిస్టేబుల్ ఫోన్‌చేసి వైన్‌షాపు వద్దకు రమ్మన్నాడు. దాంతో ఇద్దరూ వైన్‌షాపునకు వచ్చారు. అక్కడకు రాగానే తన భార్యపట్ల వారు గుసగుసలాడారని, దీంతో ఆమె ఆవేశంలో వారితో వాగ్వాదానికి దిగిందని, ఆ సమయంలో వారు తన భార్యతో అసభ్యంగా ప్రవర్తించారని చెప్పాడు. అనంతరం కానిస్టేబుల్ రమేష్, సాజిదాను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. అక్కడ ఎస్‌ఐ ఏ.మాధవిరెడ్డి కేసు వివరాలు తీసుకునే క్రమంలో అసభ్యంగా మాట్లాడిందని, తమపై కోపంతో తనను కొట్టిందని, కాలుతో తన ప్రైవేట్ ప్రదేశంలో తన్నిందని సాజిదా తన భర్తతో కలిసి వెళ్లి ఎస్సీఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదుచేశారు. వైన్‌షాపు నిర్వాహకులపై ఒక కేసు నమోదు చేసి, తమపై రెండు కేసులు నమోదు చేసిందని తెలిపారు. తమపై దాడిచేసి కులం పేరుతో దూషించిన మహిళా ఎస్‌ఐ మాధవిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్సీ ఎస్టీ కమిషన్‌ను ఆశ్రయించిన ఎర్రోళ్ల రమేష్ సాజిదాలు వెస్ట్‌జోన్ డీసీపీ విజయ్‌కుమార్‌కు కూడా ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై మధురానగర్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్‌రెడ్డి స్పందిస్తూ.. రమేష్ సాజిదా బేగంలో తమ సిద్ధం సిబ్బందిపై అసత్య ప్రచారం చేస్తున్నారని, అలాంటి ఘటన పోలీస్‌స్టేషన్‌లో జరగలేదని వివరించారు.

స్నాచర్ల హల్‌‘సెల్’

● ప్రత్యేక యాంటీ సెల్‌ఫోన్ స్నాచింగ్ బృందాల ఏర్పాటు
● సాయుధ బలగాలతో కీలక ప్రాంతాల్లో గస్తీ
● పశ్చిమ మండలంలో రంగంలోకి ప్రయోగాత్మకంగా పోలీసులు

“ ఓ క్యాబ్ డ్రైవర్ ఉదయం నుంచి కారు నడుపుతూ అలిసిపోయాడు. బంజారాహిల్స్ రోడ్డు నంబరు-1లో కారును పక్కకు పార్క్‌చేసి చిన్న కునుకు తీశాడు. నిద్రలేచేసరికి కారులో సెల్‌ఫోన్ మాయమైంది. వెంటనే డ్రైవర్ పోలీసులను ఆశ్రయించాడు. రంగంలోకి దిగిన యాంటీ సెల్‌ఫోన్ స్నాచింగ్ బృందం నిందితులను కేవలం గంటలో పట్టుకొని కటకటాల వెనక్కి నెట్టారు..

● ఓ పబ్‌లో పనిచేసే యువకుడు విధులు ముగించుకొని అర్ధరాత్రి నడుచుకుంటూ ఇంటికి వెళ్తున్నాడు. ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్రవాహనంపై వచ్చి టైం ఎంతయిందని అడిగారు. యువకుడు సమాధానం చెప్పకముందే అతడి చేతులో ఉన్న సెల్‌ఫోన్ లాక్కొని దుండగులు ఉడాయించారు. బాధితుడు ఫిర్యాదు ఇచ్చిన 24గంటల్లో యాంటీ సెల్‌ఫోన్ స్నాచింగ్ బృందం ఇద్దరు దుండగులను జైలుకు పంపించారు. ”



గస్తీ తిరుగుతున్న పెట్రోలింగ్ వాహనం

బంజారాహిల్స్, మే 22(ఆంధ్రజ్యోతి): స్నాచింగ్ ముఠాలను కట్టడి చేసేందుకు పోలీసులు నిరంతరం కొత్త ఎత్తులు వేస్తూనే ఉన్నారు. గస్తీలను మారుస్తూ స్నాచర్లలో భయం తీసుకొచ్చారు. బంగారు ఆభరణాలు ధరించి రోడ్ల మీద వెళ్లే వారికి కూడా పెద్ద ఎత్తున అవగాహన కలిగించారు. దీంతో క్రమంగా స్నాచింగ్‌లు తగ్గుతూ వచ్చాయి. ఇటీవలే స్నాచింగ్ కేసుల సంఖ్య పెరుగుతూ వచ్చాయి. బంగారు ఆభరణాలు స్నాచింగ్ అవకాశాలు తగ్గిపోవడంతో చోరులు సెల్‌ఫోన్లపై దృష్టి సారించారు. రాత్రి సమయాల్లో ఒంటరిగా వెళ్తున్న వారిపై, పగటి సమయంలో ఏమరిపాటు ఉన్న వారి వద్ద సెల్‌ఫోన్లను స్నాచింగ్ చేయడం మొదలు పెట్టారు. మొదట సెల్‌ఫోన్లే కదా అని పోలీసులు పట్టించుకోలేదు. క్రమంగా ఈ కేసులు పెరుగుతుండడంతో సెల్‌ఫోన్ స్నాచర్ల ఆటలు కట్టించేందుకు సిద్ధమయ్యారు. నగర పోలీసు కమిషనర్ కొత్తకోట శ్రీనివాసరెడ్డి ఆదేశాల మేరకు పశ్చిమ మండలంలో ప్రయోగాత్మకంగా యాంటీ సెల్‌ఫోన్ స్నాచింగ్ బృందాలను ఏర్పాటు చేశారు.

రెచ్చిపోతున్న స్నాచర్లు..

పశ్చిమ మండలం పరిధిలో స్నాచర్లు రెచ్చిపోతున్నారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో ఒంటరిగా వెళ్తున్న వారే లక్ష్యంగా సెల్‌ఫోన్‌లు స్నాచింగ్ చేస్తున్నారు. పలు సందర్భాల్లో కొట్టి మరి లాక్కుంటున్నారు. ముఖ్యంగా హిల్స్‌లో ఇలాంటి ఘటనలు పెరిగిపోతున్నాయి. ఒక్కో ఠాణాలో నెలకు పది నుంచి ఇరవై సెల్‌ఫోన్ స్నాచింగ్ కేసులు నమోదు అవ్వడం పోలీసులను, ప్రజలను కలవర పాటుకు గురి చేసింది. రెండు రోజుల క్రితం ఓ ప్రభుత్వ అధికారి ఆర్టీసీ బస్సు దిగుతుండగా నలుగురు చుట్టుముట్టి బంగారు గొలుసు స్నాచింగ్ చేశారు. మరుసటి రోజు ఓ హోటల్ కార్మికుడు విధులు ముగించుకొని ఇంటికి వెళ్తుండగా ఇద్దరు దారి కాచి మరీ సెల్‌ఫోన్ లాక్కున్నారు. ఇలాంటి ఘటనలు అనేకం జరుగుతుండడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు.

స్నాచర్లలో భయం పెరుగుతోంది



స్నాచింగ్‌లు చేసేది ఎక్కువగా పాత నేరస్థులే. కొన్ని సందర్భాల్లో వీరు ఎంతకైన తెగిస్తారు. సెల్‌ఫోన్ కోసం దాడులు చేస్తారు. ఇలాంటి వారిని నియంత్రించేందుకు యాంటీ సెల్‌ఫోన్ స్నాచింగ్ బృందాలను ఏర్పాటు చేశాం. పోలీసులు సాయుధులై ఉండడంతో స్నాచర్లు మరోసారి నేరం చేయలంటే భయ పడతారు. స్నాచింగ్‌లు అరికట్టడంలో ఈ బృందాల ద్వారా మంచి ఫలితాలు వస్తా యి. ఎప్పటికప్పుడు సిబ్బందికి సూచనలిస్తూ గస్తీని మరింత పటిష్ట పరుస్తున్నాం. భవిష్యత్తులో మరికొన్ని బృందాలను ఏర్పాటు చేస్తాం.

- శ్యామల వెంకట్‌రెడ్డి, బంజారాహిల్స్ డివిజన్ ఏసీపీ

నలుగురితో బృందం

పశ్చిమ మండలం పరిధిలో ఉన్న ఏసీపీ డివిజన్‌కు నాలుగు యాంటీ సెల్‌ఫోన్ స్నాచింగ్ బృందాలను ఏర్పాటు చేశారు. ఈ బృందంలో ఇద్దరు స్థానిక పోలీసులు, ఇద్దరు ఏఆర్ పోలీసులు ఉంటారు. వీరు మఫ్టీలో బస్టాప్‌లు, పార్కులు ఇతర ప్రాంతాల్లో గస్తీ నిర్వహిస్తారు. స్నాచింగ్ ముఠాలకు భయ పెట్టేందుకు ఏఆర్ పోలీసులు సాయుధులై ఉండడం గమనార్హం. ప్రస్తుతం బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, మాసబ్‌ట్యాంక్, సంజీవరెడ్డినగర్, మధురానగర్, బోరబండ పోలీసు స్టేషన్ల పరిధిలో ఈ బృందాలను సిద్ధం చేశారు. పది రోజులుగా ఈ బృందాలు చాలా కీలకంగా పనిచేస్తున్నాయని అధికారులు చెబుతున్నారు. స్నాచింగ్‌లను అడ్డుకోవడంతో పాటు నేరస్థుల్లో వణుకు తీసుకొచ్చేందుకు ఈ బృందాలు ఎంతో దోహద పడతాయని అధికారులు అంటున్నారు. బృందాల పనితీరుపై ఏసీపీ, డీసీపీ స్థాయి అధికారుల నియంత్రణ ఉంటుందని భావన. ఈ బృందాలు ఎప్పటికప్పుడు కాపు కాస్తూ నేరస్థుల ఆటకట్టించేలా ఈ బృందాలు పనిచేస్తాయి.

పొగాకు ఆరోగ్యానికి హానికరం



పొగాకుకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహిస్తున్న శ్రీనివాస సమాజ సేవా చారిటబుల్ ట్రస్ట్

అమీర్‌పేట, మే 22(ఆంధ్రజ్యోతి): పొగాకు తీసుకోవడంవల్ల ప్రతి ఎనిమిది నిమిషాలకు ఒకరు మరణిస్తున్నారని శ్రీసాయి ఓరల్ హెల్త్ చారిటబుల్ ట్రస్ట్, గాంధీ ఆస్పత్రి మాజీ ఆర్‌ఎంవో డాక్టర్ నాగేశ్వర్‌రావు అన్నారు. దేశంలో ప్రతి సంవత్సరం 10 లక్షల మందికి పైగా ఈ పొగాకు ఉత్పత్తుల కారణంగా నోటి కేన్సర్ భారిన పడుతూ... మృతి చెందుతున్నరని నివేదికలు సూచిస్తున్నాయని వెల్లడించారు. మే 1 నుంచి 31 వరకు జరిగే ప్రపంచ పొగాకు వ్యతిరేక మాసోత్సవాలను ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తూ పొగాకు ఉత్పత్తుల వాడకంవల్ల జరిగే అనర్థాలను వివరిస్తూ యువకులు, పెద్దలకు కరపత్రాలు అందిస్తూ అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా బుధవారం ఎస్‌ఆర్‌నగర్‌లోని శ్రీనివాస చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన ఉచిత మధ్యాహ్న మిత భోజన శిబిరం నుంచి యువకులు, పెద్దలకు అవగాహన కల్పిస్తూ పొగాకు అనర్థాలను సూచించే బ్యానర్‌తో ర్యాలీ నిర్వహించారు. వీటి బారిన పడిన తరువాత నోటి మంటతో ప్రారంభమయ్యే అనర్థాలను వెంటనే నియంత్రలోకి తీసుకురాకపోతే అది నోటి కేన్సర్ వరకు వెళ్లి మృత్యువాత పడేవరకు తీసుకెళ్తుందని వివరించారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ సూచిక బోర్డు ఉండగా ఆక్రమణ



ఉదయ్‌నగర్‌లో స్థలాన్ని పరిశీలించిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి విజయారెడ్డి

బంజారాహిల్స్, మే 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సూచిక బోర్డు ఉన్నప్పటికీ బస్తీ మధ్యల ఉన్న 250గజాల స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపడుతుండగా కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదుతో స్పందించిన జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు బుధవారం కూల్చివేతలు చేపట్టారు. బంజారాహిల్స్ రోడ్డు నంబరు-10 ఉదయ్‌నగర్‌లో ప్రభుత్వానికి చెందిన 250 గజాల స్థలం ఉంది. దీన్ని గతంలో పక్కనే ఉన్న కాలనీవాసులు ఆక్రమించేందుకు ప్రయత్నించారు. అప్పటి రెవెన్యూ అధికారులు స్థలంలో ప్రభుత్వ సూచిక బోర్డు ఏర్పాటు చేశారు. ఇటీవలే తిరిగి కొంత మంది బోర్డు ఉండగానే స్థలం చుట్టూ ప్రహరీ నిర్మాణం మొదలు పెట్టారు. విషయం తెలుసుకున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి.విజయారెడ్డి అక్కడకు చేరుకొని పరిశీలించారు. జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. వెంటనే కూల్చివేతలు చేపట్టాలని డిమాండ్ చేశారు. టౌన్‌ప్లానింగ్ సిబ్బంది కూల్చివేతలు చేపట్టారు. ఈసందర్భంగా విజయారెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ స్థలాల్లో బస్తీ వాసుల కోసం అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించేలా సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లనున్నట్టు చెప్పారు.

గ్రామస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ శ్రీనివాసరావు

పంజాగుట్ట, మే 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీ చేస్తామని ఇండియన్ ప్రజా కాంగ్రెస్ (ఐపీసీ) పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నియమితులైన డాక్టర్ సింగం శ్రీనివాసరావు అన్నారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు కేబీ శ్రీధర్ అధ్యక్షతన బుధవారం పార్టీ కార్యాలయంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఇందులో వివిధ అంశాలను చర్చించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలని తీర్మానించారు. ఈ సందర్భంగా ప్రముఖ వైద్యులు సింగం శ్రీనివాస్ రావుతో పాటు పలువురు పార్టీలో చేరారు. ఆయనను పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నియమించారు. పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేస్తామని డాక్టర్ సింగం శ్రీనివాసరావు అన్నారు. త్వరలోనే అన్ని జిల్లాల్లో పర్యటించి, గ్రామ, మండల, నియోజకవర్గం, జిల్లాల వారిగా నూతన కమిటీలు ఏర్పాటు చేసి, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బలమైన అభ్యర్థులను పోటీలో నిలుపుతామన్నారు. అందరికీ అందుబాటులో ఉండేలా త్వరలో సంజీవరెడ్డి నగర్‌లో పార్టీ కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తామని ఆయన చెప్పారు. సమావేశంలో పార్టీ సలహాదారు అనిత హరి, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉదయలక్ష్మి, ఉపాధ్యక్షుడు దశరథం, ఓబీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.భాస్కర్, పార్టీ వివిధ విభాగాల నాయకులు డాక్టర్ లక్ష్మి, పుష్పాంజలి, నవీన్, కట్టా రమేష్, పావని, నరసింహగుప్తా, శారద, ఎన్.కొండలరావు, సరిత పాల్గొన్నారు.

ఘనంగా నర్సింహస్వామి జయంతి వేడుకలు



ఉత్సవ విగ్రహానికి చక్రస్నానం చేయిస్తున్న హరేకృష్ణ మూవ్‌మెంట్ నిర్వాహకులు

బంజారాహిల్స్, మే 22 (ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్ రోడ్డు నంబరు-12 స్వయంభు లక్ష్మీనర్సింహ స్వామి (స్వర్ణ) దేవాలయంలో హరే కృష్ణమూవ్‌మెంట్ ఆధ్వర్యంలో నరసింహ స్వామి జయంతి వేడుకలు కనుల పండువగా జరుగుతున్నాయి. బుధవారం ఉదయం మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకం అనంతరం నరసింహ స్వామికి మహాహోమం, పూర్ణాహుతి భూ సమేత లక్ష్మీనర్సింహ స్వామి కల్యాణం నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ విగ్రహానికి 108 కలశాలతో మహా అభిషేకం అనంతరం ఉంజాల సేవ చేశారు. మూవ్‌మెంట్ అధ్యక్షుడు సత్యచంద్రగౌరదాస ప్రవచనంతో ఉత్సవాలు ముగిశాయి.

ఆలయానికి డస్ట్‌బిన్స్ అందజేత



ఈవో నాగరాజుకు డస్ట్ బిన్స్ అందజేస్తున్న వాసవీ క్లబ్ నిర్వాహకులు

అమీర్‌పేట, మే 22 (ఆంధ్రజ్యోతి): సామాజిక సేవలో భాగంగా అమీర్‌పేట వాసవీ క్లబ్ నిర్వాహకులు బుధవారం బల్కంపేట ఎల్లమ్మ, పోచమ్మ ఆలయం ఈవో కుంట నాగరాజుకు 11హై క్వాలిటీ డస్ట్‌బిన్స్‌తో పాటు ప్లాస్టిక్ టబ్‌ను ఆలయ ప్రాంగాణంలో అందజేశారు. ఈసందర్భంగా వీసీఐ డిస్టిక్ ఇన్‌చార్జి తోట భిక్షపతి మాట్లాడుతూ... ఆలయ పరిసరాలు నిత్యం పరిశుభ్రంగా ఉంచాలన్న లక్ష్యంతో డస్ట్ బిన్స్ అందజేశామన్నారు. కార్యక్రమంలో అమీర్‌పేట వాసవీ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు డిస్టిక్ ఇన్‌చార్జి వీసీఐ మాజీ ధర్మకర్త సింగారపు శ్రీనివాస్ గుప్తా, అడ్వైజర్స్ దొంతుల నాగభూషణం, వాడకట్టు బాలజీ, మంచాల ప్రవీణ్, కన్య, గుండ్ల సతీష్, మురారిశెట్టి శ్రావణ్ కుమార్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

వరద నీటి కట్టడికి చర్యలు తీసుకోవాలి



సైట్-3లో పర్యటించిన బాబా ఫసియుద్దీన్

యూసుఫ్‌గూడ, మే 22(ఆంధ్రజ్యోతి): దిగువ ప్రాంతాల్లో ఉన్న బస్తీలు వరద ముంపునకు గురి కాకుండా తగు చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్, మాజీ డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్ జీహెచ్‌ఎంసీ అధికారులను కోరారు. డివిజన్ పరిధిలోని పలు బస్తీలో నాయకులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వర్షపు నీటిని కట్టడి చేయడానికి ఇప్పటి నుంచి చర్యలు తీసుకోవాలన్నారు. నాలాలో పూడిక తీయడం, ఇసుకతో మూసుకపోయిన మ్యాన్‌హోల్ మూతలను శుభ్రం చేయడం, పగిలిన వాటికి మరమ్మతులు చేపట్టాని అధికారులకు సూచించారు. ఈ పర్యటనలో పలు బస్తీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

తీన్మార్ మల్లన్నకు సంపూర్ణ మద్దతు

● తెలంగాణ రాష్ట్ర అడ్వకేట్ జేఏసీ

బర్కత్‌పుర, మే 22(ఆంధ్రజ్యోతి): నల్గొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్టు తెలంగాణ రాష్ట్ర అడ్వకేట్ జేఏసీ వెల్లడించింది. పట్టభద్రుల నియోజకవర్గం పరిధిలో ఉన్న న్యాయవాదులందరూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అడ్వకేట్ జేఏసీ కో-ఆర్డినేటర్ వెంకటేష్ ఇంద్రపల్లి, కార్యనిర్వాహక కార్యదర్శి దమ్మిగారి కనకయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్‌లు పంతం రాజేష్, గుంపుల శ్రీకాంత్‌యాదవ్ మాట్లాడారు. తీన్మార్ మల్లన్నను గెలిపించి సీఎం రేవంత్‌రెడ్డికి కానుకగా ఇవ్వాలని కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పంజాగుట్ట, మే 22(ఆంధ్రజ్యోతి): మరమ్మతుల కారణంగా గ్రీన్ ల్యాండ్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ బానో తు చరణ్ సింగ్ తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12.30వరకు 11కేవీ హెచ్.పీ రోడ్ ఫీడర్ పరిధిలో, మధ్యాహ్నం 12.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు 11కేవీ మూసాపేట్ ఫీడర్ పరిధిలో, మధ్యాహ్నం 2 గంటల నుంచి మధ్యాహ్నం 3.30 వరకు 11 కేవీ కళ్యాణ్ నగర్ ఫీడర్ పరిధిలో, మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 5గంటల వరకు 11 కేవీ పీఆర్ నగర్ ఫీడర్ పరిధిలో విద్యుత్ ఉండదని ఏడీఈ పేర్కొన్నారు.

● బంజారాహిల్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ ఉండదని ఏడీఈ శ్రీనివాస్ తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12.30వరకు 11 కేవీ కలెక్టర్ బంగ్లా, ప్రగతినగర్ ఫీడర్ల పరిధిలో, మధ్యాహ్నం 1.30 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు 11కేవీ సాయి ఎంక్లేవ్, సత్యసాయి కల్యాణ మండపం ఫీడర్ల పరిధిలో, మధ్యాహ్నం 3.30గంటల నుంచి సాయంత్రం 5 వరకు 11కేవీ చిరాన్ ప్యాలెస్, కమ్మ సంఘం ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని ఏడీఈ పేర్కొన్నారు.

● సైఫాబాద్ పరిధిలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు 11కేవీ ఆదర్శ్‌నగర్, మధ్యాహ్నం 12.30 గంటల నుంచి మధ్యాహ్నం 2వరకు 11 కేవీ అనుగ్రహ ఫీడర్ పరిధిలో, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 4 వరకు 11 కేవీ ఖైరతాబాద్ సెవెన్ టెంపుల్ ఫీడర్ పరిధిలో, సాయంత్రం 4 గంటల నుంచి సాయంత్రం 5 వరకు 11కేవీ విజయ ఆస్పత్రి ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ ప్రేమానంద్ పాయ్ పేర్కొన్నారు.

రూ. 20 పంపితే

రూ. 20,560 మాయం

యూసుఫ్‌గూడ, మే 22(ఆంధ్రజ్యోతి): ఉద్యోగాలు ఓపెన్ అయ్యాయని వచ్చిన మెయిల్‌కు స్పందించి దరఖాస్తు కోసం క్రెడిట్ కార్డులో ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్ చేయగా అధిక మొత్తంలో డెబిట్ అయిన సంఘటనపై ఓ మహిళ మధురానగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రహ్మత్‌నగర్‌లో నివాసం ఉండే వద్ది త్రివేణి ప్రైవేట్ ఉద్యోగి. ఈనెల 2వ తేది మధ్యాహ్నం 3.10గంటలకు అవినాష్‌శెట్టి టాటాకన్సల్టెంట్స్ పేరుతో మెయిల్ వచ్చింది. ఆ మెయిల్‌లో ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవచ్చని ఉంది. దీంతో ఆమె దరఖాస్తు చేసుకునేందుకు ఆసక్తి చూపడంతో దరఖాస్తు కోసం రూ. 20 పంపాలని వారు సూచించారు. ఆమె తన ఎస్‌బీఐ క్రెడిట్ కార్డుతో రూ. 20 పంపింది. కానీ ఆమె క్రెడిట్ కార్డు నుంచి రూ. 20,560 డెబిట్ అయ్యింది. ఆమె వెంటనే ఎస్‌బీఐ క్రెడిట్ కార్డు విభాగానికి ఫోన్ చేసి ట్రాన్జెక్షన్ నిలిపివేయాలని ఫిర్యాదు చేసింది. రెండు రోజుల తర్వాత పోలీస్ ఎఫ్ఐఆర్ కాపీ జతచేయాలని కోరగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసి ఫిర్యాదు నంబరు ఇచ్చింది. కానీ 18వ తేది ఎస్‌బీఐ సిబ్బంది ఎఫ్ఐఆర్ కాపీ జతచేయాలని చెప్పడంతో మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

నర్సాపూర్‌లో మహారాష్ట్ర పోలీసుల సోదాలు

● నిషేధిత ద్రవ మత్తు పదార్థం, తయారీ సామగ్రి స్వాధీనం
● పోలీసులు వచ్చారన్న సమాచారంతో కీలక వ్యక్తి పరార్
● కుటుంబ సభ్యుల్లో ఒకరిని విచారించి వదిలేసిన పోలీసులు
● కలకలం రేపిన సంఘటన



నర్సాపూర్‌లో ఉన్న రేకుల షెడ్డు

మర్పల్లి, మే 22(ఆంధ్రజ్యోతి): బెంగళూరు రామేశ్వరం కేఫే బాంబు పేలుళ్లకు సంబంధం ఉందని అనుమానిస్తున్న ఓ వ్యక్తిని వికారాబాద్ జిల్లా కేంద్రంలో ఎన్ఐఏ అధికారులు అదుపులోకి తీసుకున్న సంఘటన మరువక ముందే మర్పల్లి మండలం, నర్సాపూర్ శివారులోని ఓ రహస్య స్థలంలో నిషేధిత మత్తు పదార్థాలు తయారు చేస్తున్నారనే సమాచారంతో మహారాష్ట్ర పోలీసులు సోదాలు నిర్వహించడం కలకలం రేపింది. నర్సాపూర్ గ్రామంలో చెరువు పక్కనే ఉన్న ఓ వ్యవసాయ క్షేత్రంలో నిషేధిత మత్తు పదార్థాలు తయారు చేస్తున్నారనే సమాచారంతో మహారాష్ట్ర పోలీసులు బుధవారం తెల్లవారుజామున ఆకస్మికంగా సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో మహారాష్ట్ర పోలీసులు రేకుల షెడ్డులో మూడు లీటర్ల వరకు ద్రవ మత్తు పదార్థంతో పాటు నిషేధిత మత్తు పదార్థాలు తయారు చేసే సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది.. సంఘటన స్థలంలో స్వాధీనం చేసుకున్న సామగ్రి వివరాలను వారు తమ ఉన్నతాధికారులకు వివరించినట్లు చెబుతున్నారు. సంఘటన స్థలం ఏ సర్వే నెంబర్‌లోకి వస్తుంది, యజమాని ఎవరు అనే సమాచారం కోసం మహారాష్ట్ర పోలీసులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం అధికారులను సంప్రదించి వివరాలు సేకరించారు. నర్సాపూర్ గ్రామంలోని సర్వే నెం.48లో ఉన్న పొలంలో రేకుల షెడ్డులో కొన్ని రోజులుగా నిషేధిత మత్తు పదార్థాలు తయారు చేస్తున్నారనే సమాచారంతోనే మహారాష్ట్రకు చెందిన థానే పోలీసులు ఇక్కడకు వచ్చినట్లు తెలుస్తోంది. మత్తు పదార్థాలు సరఫరా చేసే వ్యక్తుల ద్వారా రాబట్టిన సమాచారం మేరకే మహారాష్ట్ర పోలీసులు ఇక్కడకు వచ్చినట్లు చెబుతున్నారు. ఇదిలా ఉంటే, రేకుల షెడ్డు వద్దకు పోలీసులు వచ్చిన విషయాన్ని పసిగట్టిన అక్కడున్న ఓ వ్యక్తి చెరువులో దూకి అక్కడి నుంచి పారిపోయినట్లు తెలుస్తోంది. కాగా, పారిపోయిన వ్యక్తి కుటుంబ సభ్యుల్లో ఒకరిని పోలీసులు అదుపులోకి తీసుకుని కొంత సమాచారం సేకరించి అతడిని వదిలేశారు. తాము విచారణకు హాజరు కావాలని సమాచారం ఇచ్చినప్పుడు రావాలంటూ స్పష్టం చేసినట్లు తెలిసింది. ఇదిలా ఉంటే, రేకుల షెడ్డులో స్వాధీనం చేసుకున్న సామగ్రిని ఓ వాహనంలో తమ వెంట మహారాష్ట్రకు తరలించారు. ఈ సంఘటనపై జిల్లా, స్థానిక పోలీసులకు సమాచారం లేకపోవడం గమనార్హం.



రైల్వే స్టేషన్‌లో పట్టుకున్న బంగారు నగల్ని చూపిస్తున్న రైల్వే డీఎస్పీ జావేద్, సీఐ సాయి ఈశ్వర్‌గౌడ్

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో బంగారం పట్టివేత

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, మే 23 (ఆంధ్రజ్యోతి) : రైల్వే అదనపు డీజీపీ మహేష్ భగవత్, సికింద్రాబాద్ రైల్వే ఎస్పీ సలీమా ఆదేశాల మేరకు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో జనరల్ చెకింగ్ చేస్తుండగా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ఓ ప్రయాణికుడి నుంచి రూ.18.20లక్షల విలువ చేసే బంగారు నగల్ని స్వాధీనం చేసుకున్నామని సికింద్రాబాద్ రైల్వే డీఎస్పీ జావేద్, సికింద్రాబాద్ జీఆర్పీ సీఐ సాయి ఈశ్వర్‌గౌడ్ తెలిపారు. జీఆర్పీ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బుధవారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో సీఐ సాయి ఈశ్వర్‌గౌడ్‌తోపాటు కానిస్టేబుళ్లు మునీశ్వర్, చంద్రశేఖర్‌తో పాటు క్రైమ్ కానిస్టేబుళ్లు ప్లాట్ ఫాం నెంబరు 2లో చెకింగ్ చేస్తుండగా చార్మినార్‌కు చెందిన కౌషిక్ సంత్రా అనే ప్రయాణికుడిని తనిఖీ చేయగా ఇతని వద్ద నుంచి 260 గ్రాముల విలువ చేసే రూ.18.20లక్షల విలువ చేసే బంగారు నగల్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. ప్రయాణికుడు నిత్యం సికింద్రాబాద్ నుంచి విజయవాడ రైళ్లలో ప్రయాణం చేస్తున్నాడని, బంగారు వ్యాపారం చేస్తున్నాడని, రైల్వే స్టేషన్‌లో పట్టుబడ్డ బంగారానికి సంబంధించిన ఎలాంటి డాక్యుమెంట్లు లేకపోవడంతోపాటు పొంతన లేని సమాధానాలు చెప్పడంతో బంగారు ఆభరణాలు ఐటీ అధికారులకు అప్పగిస్తున్నామని డీఎస్పీ తెలిపారు. జనరల్ చెకింగ్‌లో నగలు పట్టుబడ్డట్లు తెలిపారు.



తప్పిపోయిన బాలుడిని చేరదీసిన పోలీసులు

తప్పిపోయిన బాలుడు ప్రభుత్వ హోంకు తరలింపు

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ప్లాట్ ఫాం నెంబరు 10లో 8ఏళ్ల బాలుడు ఒంటరిగా నిలబడి ఉండగా, సికింద్రాబాద్ ఆర్పీఎఫ్ ఎస్ఐ వెంకటరెడ్డి, మహిళా కానిస్టేబుల్ వైశాలిలు బాలుడిని చేరదీసి తల్లిదండ్రుల వివరాల కోసం ప్రయత్నించినా ఫలితంలేకపోయింది. బాలుడిని చేరదీసి చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ద్వారా ప్రభుత్వ హోంకు తరలించారు. బాలుడి తల్లిదండ్రుల వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నామని సికింద్రాబాద్ ఆర్పీఎఫ్ సీఐ ఎంవి రెడ్డి తెలిపారు.

- సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, ఆంధ్రజ్యోతి



ప్రయాణికుడికి సెల్‌ఫోన్‌ను అందజేస్తున్న ఆర్పీఎఫ్ పోలీసు

ప్రయాణికుడికి సెల్‌ఫోన్ అందజేత

నాంపల్లి రైల్వే స్టేషన్‌లో హైద్రాబాద్‌కు చెందిన ఫణీందర్ అనే ప్రయాణికుడు రూ.20వేల విలువ చేసే సెల్‌ఫోన్ కనిపించకపోవడంతో బాధితుడు వెంటనే నాంపల్లి ఆర్పీఎఫ్ సీఐ కల్పనకు ఫిర్యాదుచేయడంతో వెంటనే రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాం నెంబరు4లో గాలించగా సెల్‌ఫోన్ దొరకడంతో బాధితుడికి అప్పగించారు.

- సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, ఆంధ్రజ్యోతి

శ్రీహనుమాన్ దేవాలయం మాజీ చైర్మన్ శ్రీనివాస్ ఆకస్మిక మృతి



శ్రీనివాస్ (ఫైల్)

తిరుమలగిరి, మే 22 (ఆంధ్రజ్యోతి): బొల్లారం డౌటన్ బజార్‌కు చెందిన దేవాదాయ ధర్మాదాయ శాఖకు చెందిన శ్రీహనుమాన్ దేవాలయం మాజీ చైర్మన్ శ్రీనివాస్ బుధవారం మధ్యాహ్నం మృతిచెందారు. ఇంట్లో ఒక్కసారిగా కుప్పకూలిపోవడంతో కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే చనిపోయినట్లు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీలో చురుకైన పాత్రను పోషించారు. ఆయనకు భార్య ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తె అమెరికాలో ఉన్న నేపథ్యంలో రెండు రోజుల్లో దహన సంస్కారాలు నిర్వహించనున్నామని ఆయన సోదరుడు, సికింద్రాబాద్ గణేష్ టెంపుల్ మాజీ ధర్మకర్త బాలరాజ్ తెలిపారు. అప్పటివరకు శ్రీనివాస్ మృతదేహాన్ని హాస్పిటల్‌లో భద్రపరిచినట్లు తెలిపారు.



భాగ్యరెడ్డికి నివాళులర్పిస్తున్న ఆల్ మాల స్టూడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నామ సైదులు

భాగ్యరెడ్డికి ఘన నివాళులు

ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో దళితోద్యమ తొలిపొద్దు భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఆల్ మాల స్టూడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నామ సైదులు, విద్యార్థినాయకులు.

- తార్నాక, ఆంధ్రజ్యోతి

రోడ్డు విస్తరణకు నోచుకోని వారాసిగూడ చౌరస్తా

- ప్రతిరోజూ నరకం చూస్తున్న వాహనదారులు
- రోడ్డు విస్తరణ చేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు వేడుకోలు

బౌద్ధనగర్, మే21 (ఆంధ్రజ్యోతి): చిలకలగూడ - జామై ఉస్మానియా ప్రధానరహదారి రోడ్డు విస్తరణ పనులు మూలనపడ్డాయి. గతంలో రోడ్డు విసర్తణ కోసం జీహెచ్ఎంసీ కౌన్సిల్‌లో నిధులు మంజూరైనా ఇప్పటివరకు రోడ్డు విస్తరణ ప్రతిపాదనలు ముందుకు సాగటంలేదు. అధికారులు అప్పుడప్పుడు రోడ్డు విస్తరణ పేరిట హడావిడి చేసి వెళుతుంటారు. గత ఇరవై సంవత్సరాల చిలకలగూడ - జామై ఉస్మానియా రోడ్డు విస్తరణ పనులు కలగానే మిగిలిపోవటంతో వాహనాదారులు, స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గత ఇరవై సంవత్సరాల్లో జీహెచ్ఎంసీ అధికారులు రోడ్డు విస్తరణ పేరిట మూడుసార్లు మార్కింగ్ వేసి చేతులు దులుపుకున్నారు. కనీసం వ్యాపారులు, భవన యజమానులతో విస్తరణపై సమావేశాలు కూడా నిర్వహించలేదు. రోజు రోజుకీ వాహనాల సంఖ్య పెరగటం, రోడ్డు ఇరుకు కావటంతో నిత్యం ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. నగరంలో అన్నిచోట్ల రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నా సికింద్రాబాద్ నియోజకవర్గం చిలకలగూడ - వారాసిగూడ, జామై ఉస్మానియా ప్రధానరహదారిని విస్తరించకపోవటంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు విస్తరణ జరిగి ఆయా ప్రాంతాలు అభివృద్ధి జరుగుతుంటే ఈ ప్రాంతం నగరంలో వెనుకబడి ఉందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇరవై సంవత్సరాల నుంచి రోడ్డు విస్తరణ ప్రతిపాదన

ఇరవై సంవత్సరాల నుండి చిలకలగూడ - వారాసిగూడ - జామై ఉస్మానియా విస్తరణ పనులు పెండింగ్ పడుతూనే వస్తున్నాయి. గతంలో ఆయా ప్రభుత్వాల హయాంలో రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని స్థానిక ప్రజలతోపాటు వివిధ పార్టీ నాయకులు విజ్ఞప్తి చేసిన సందర్భాలున్నాయి. ఈ ఇరవై సంవత్సరాల్లో చిలకలగూడ చౌరస్తా నుంచి జామై ఉస్మానియా వరకు రోడ్డు విస్తరణకు సంబంధించి అధికారులు సిబ్బందితో మార్కింగ్ వేయించారు. తరువాత రోడ్డు విస్తరణకు సంబంధించిన ప్రతిపాదనలు మూలనపడ్డాయి. రానురాను జనాభా పెరగటంతో పాటు వాహనాల సంఖ్య పెరగటంతో ఈ రహదారిలో వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతూ వస్తుంది. జామై ఉస్మానియా, బౌద్ధనగర్, ఆర్ట్స్‌కాలేజీ, వారాసిగూడ, శ్రీదేవీ నర్సింగ్‌హోమ్, నామాలగుండు, సీతాఫల్‌మండి, మైలార్‌గడ్డ, చిలకలగూడ తదితర ప్రాంతాల నుంచి ప్రతిరోజు వేలాది మంది వివిధ పనుల నిమిత్తం నగరంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లుతుంటారు. రోడ్డు ఇరుకుగా ఉండటంతో బస్సుల సంఖ్యను తగ్గించారు. అలాగే చిలకలగూడ, సీతాఫల్‌మండి, వారాసిగూడ, టర్నింగ్‌పాయింట్ వద్ద మూలమలుపులు ఉండటంతోపాటు రహదారి ఇరుకుగా ఉండటంతో వాహనాలు ఎదురెదురుగా వెళ్లాలంటే డ్రైవర్లు చాలా ఇబ్బందులు పడుతున్నారు. కొంతమంది వ్యాపారులు ఉన్న ఇరుకు రోడ్లను ఆక్రమించుకుని వ్యాపార లావాదేవీలు నిర్వహించటంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు విస్తరణకు ప్రతిపాదనలు చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



వారాసిగూడ చౌరస్తా మూలమలుపులో ఆర్టీసీ బస్సుల అవస్థలు

రోడ్డు విస్తరణలో నష్టపాయినవారికి టీడీఆర్ స్కీమ్

రోడ్డు విస్తరణలో నష్టపోయినవారికి ప్రభుత్వం తరపున టీడీఆర్ (ట్రాన్స్‌ఫర్ ఆఫ్ డెవలప్‌మెంట్ రైట్) స్కీమ్‌ను గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఈ స్కీమ్ వద్దనుకున్నవారికి చెక్కుల రూపంలో నష్టపరిహారం చెల్లించటానికి నిర్ణయించారు. చిలకలగూడ నుంచి జామై ఉస్మానియా వరకు రోడ్డు విస్తరణలో 347 ఇళ్లు, వ్యాపార భవనాలు కనుమరుగుకానున్నాయి. రోడ్డు విస్తరణ చేయవద్దని కొంతమంది వ్యాపారులు అడ్డుపడుతున్నట్లు సమాచారం.

రోడ్డు ఇరుకును బట్టి విస్తరణ

చిలకలగూడ నుంచి జామై ఉస్మానియా వరకు మొదట 60 అడుగుల మేర విస్తరించాలని గతంలో అధికారులు మార్కింగ్ వేసినప్పటికీ.. తరువాత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మాస్టర్ ప్లాన్‌లో చిలకలగూడ, సీతాఫల్‌మండి, వారాసిగూడ, టర్నింగ్ పాయింట్ చౌరస్తాలను 80 అడుగులు, మామూలు చోట 60 అడుగుల విస్తరించాలని ప్రతిపాదనలు చేశారు. తెలంగాణ ప్రభుత్వంలో ప్లాట్‌గా 80 అడుగులు విస్తరించాలని ప్రతిపాదనలు చేశారు. ప్రసుత్తం రోడ్డు ఇరుకునుబట్టి రోడ్డును విస్తరించాలని, భవిష్యత్‌లో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా రోడ్డు విస్తరించేలా ప్రతిపాదనలు సిద్ధం చేసేలా ప్రణాళికలు రూపొందించారు.



రోడ్డు విస్తరణ చేయకనే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు

చిలకలగూడ - వారాసిగూడ రోడ్డు విస్తరణ చేయకనే ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. గతంలో రోడ్డు విస్తరణపై జీహెచ్ఎంసీ అధికారులు, ప్రజాప్రతినిధులను కలిసి ఫిర్యాదు చేసిన సందర్భాలున్నాయి. వారాసిగూడ చౌరస్తాలో రెండు వాహనాలు ఎదురెదురుగా వెళ్లాలంటే చాలా కష్టమనిపిస్తుంది. డ్రైవర్లు ఓపికతో వాహనాలను నడుపుతున్నారు. ఉదయం, సాయంత్రం వాహనాల రాకపోకలకు చాలా అంతరాయం కలుగుతుంది. మూలమలుపులో ఆటోలు పెట్టడం వలన పాదచారులు, ద్విచక్రవాహనదారులు చాలా అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం తొందరగా స్పందించి వారాసిగూడ రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

- వల్లారపు శ్రీనివాసకుమార్, టీడీపీ సికింద్రాబాద్ ఇన్‌చార్జి, వారాసిగూడ



కనీసం మూలమలుపులను విస్తరించాలి

చిలకలగూడ, సీతాఫల్‌మండి, వారాసిగూడ, టర్నింగ్ పాయింట్ వద్ద మూలమలుపులను విస్తరిస్తే మంచిది. మూలమలుపుల రోడ్లలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇరుకుగా ఉన్నా రోడ్డు పక్కన వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. వారాసిగూడ చౌరస్తాలో ఆర్టీసీ బస్సులు ఎదురెదురుగా వస్తున్నాయంటే డ్రైవర్లు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు విస్తరణ పనుల ప్రతిపాదనలను ముందుకు తీసుకురావాలి.

- నందారం సీతారాం, బీదలబస్తీ సంక్షేమసంఘం అధ్యక్షుడు

సమ్మర్ ఉత్సవ్ మేళాలో సందడే సందడి..

- ఆకట్టుకుంటున్న కశ్మీర్ మంచుకొండల దృశ్యాలు



ప్రదర్శనలో చేపలను చూస్తున్న సందర్శకులు

ఖైరతాబాద్, మే 22 (ఆంధ్రజ్యోతి): ఎన్నో రోజులుగా నగరవాసులు ఎదురుచూస్తున్న సమ్మర్ ఉత్సవ్ మేళా బుధవారం ప్రారంభమైంది. ప్రతి ఏటా ఓ వైవిధ్యతతో తయారయ్యే ఈ మేళాలో ఈసారి చల్లటి కశ్మీర్‌లో విహరించిన అనుభూతి కలిగేలా చేసిన ఏర్పాట్లు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. మంచు పడుతున్న చలి నుంచి వెళ్తున్న అనుభూతి కలిగేలా ఏర్పాటైన టన్నెల్ మరింత ఆకట్టుకుంటోంది. దీంతో పాటు అమ్యూజ్‌మెంట్ రైడ్లు, పలు రాష్ట్రాల నుంచి వచ్చిన వర్తకులు తమ స్టాళ్ల ద్వారా ఎన్నో రకాల వస్తువులు, హ్యాండ్లూమ్, హ్యాండీక్రాఫ్ట్ వస్తువులను విక్రయానికి ఉంచారు. తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన తినుబండారాలతో కూడిన వాటిని ఇష్టంగా ఆరగిస్తూ కుటుంబ సమేతంగా సందర్శకులు సమ్మర్ ఉత్సవ్ మేళాలో సందడి చేస్తున్నారు. ఐమాక్స్ పక్కనున్న హెచ్ఎండీఏ ఖాళీ ప్రదేశంలో ఈ ప్రదర్శన ప్రతి రోజూ మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు ఉంటుందని నిర్వాహకుడు మీర్జా రఫీక్‌బేగ్ తెలిపారు.

తల్లీకూతురు అదృశ్యం



అయేషా బేగం, సమ్రీన్

ఖైరతాబాద్, మే 22 (ఆంధ్రజ్యోతి): తల్లితో పాటు కూతురు అదృశ్యమయ్యారు. ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్ ఏఎస్ఐ శ్రీరాములు తెలిపిన వివరాల మేరకు... బంజారాహిల్స్ నందినగర్‌కు చెందిన మహ్మద్ నవాజ్ తన ఆటోలో భార్య అయేషా బేగం(35)తో పాటు కూతురు సమ్రీన్(12)ను ఎక్కించుకొని ఈనెల 21 రాత్రి 8 గంటల సమయంలో వెళ్తున్నారు. భార్యాభర్తల మధ్య ఉన్న గొడవలతో భార్య ఆటో ఖైరతాబాద్ ఫ్లైఓవర్ పైకి రాగానే రక్షించండి.. రక్షించండి అంటూ కేకలు వేయడంతో వాహనదారులు ఆటోను ఆపి భార్యా బిడ్డలను బయటకు పంపారు. అప్పటి నుంచి వారు ఇంటికి రాలేదని భర్త నవాజ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ ఎల్‌వోసీ పత్రం అందజేత

మల్కాజిగిరి, మే 22 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణానగర్‌కు చెందిన సప్వాన్ సబేర్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని సంప్రదించగా ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.1.5లక్షలు మంజూరు చేయించారు. బాధితుడికి బుధవారం ఎల్‌వోసీ పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఎన్.జగదీష్ గౌడ్, జేఏసీ నేత వెంకన్న, రాముయాదవ్, వెంకటేష్‌యాదవ్, శ్రీకాంత్, మణిరత్నం తదితరులు పాల్గొన్నారు.



శ్రీలక్ష్మీనరసింహ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న తలసాని శ్రీనివాస్‌యాదవ్

శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి

- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

రాంగోపాల్‌పేట్, మే 22 (ఆంధ్ర జ్యోతి): శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆకాంక్షించారు. శ్రీ లక్ష్మీ నరసింహస్వామి జయంతి సందర్భంగా రాంగోపాల్‌పేట్ డివిజన్ పరిధిలోని జీరాలో గల పురాతన లక్ష్మీ నరసింహస్వామి దేవాలయంలో స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు నర్సింహ తలసానిని సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఎమ్మెల్యే వెంట రాంగోపాల్‌పేట్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు అత్తెల్లి శ్రీనివాస్‌గౌడ్ ఉన్నారు.

దేవాలయం అభివృద్ధికి కృషి : నరసింహన్

తిరుమలగిరి, మే 22 (ఆంధ్రజ్యోతి): బొల్లారం డౌటన్ బజార్‌లోని భూలక్ష్మమ్మ దేవాలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి డాక్టర్ నరసింహన్ కన్నన్ అన్నారు. బుధవారం తన సొంత నిధులను వెచ్చించి దేవాలయం ప్రాంగణంలో సిమెంటు ఊడిపోయిన టైల్సు ఇతరత్రా పనులను చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బొల్లారం డౌటన్ బజార్ ప్రాంతవాసులకు కోరిన కోర్కెలను తీర్చడంతోపాటు కొంగు బంగారంగా భక్తులకు అండగా నిలుస్తుందని అన్నారు. ప్రతి పౌర్ణమికి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతోపాటు అన్నదాన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. అందులో భాగంగానే గురువారం పౌర్ణమిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు అమ్మవారికి అర్చన, అభిషేకాలతోపాటు మధ్యాహ్నం అన్నదాన ప్రసాదం వితరణగావించుతున్నామని తెలిపారు. పరిసర ప్రాంతాలకు చెందిన మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి ప్రత్యేక పూజలలో పాల్గొనడంతో పాటు అన్నదాన ప్రసాద వితరణలో పాలుపంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ గణేష్ దేవాలయం మాజీ ధర్మకర్త జీవి బాల్‌రాజ్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఖరీఫ్ సాగుకు ప్రణాళికలు సిద్ధం

మేడ్చల్, మే 22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో ఖరీఫ్ సాగుకు వ్యవసాయాధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. 2024-25 సంవత్సరంలో జిల్లాలో 28,115 ఎకరాల భూమి సాగు అవుతుందని అంచనా వేసి ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచడానికి చర్యలు చేపట్టారు.

వరి-18,900, కందులు-50, మొక్కజొన్న-250, జొన్న-25, పత్తి-130, మినుములు-25, పండ్లతోటలు-4,170, కూరగాయలు-1,820, ఇతర పంటలు-520 ఎకరాలు సాగవుతుందని అధికారులు ప్రణాళికలు రూపొందించారు.

జిల్లాలో సాగు విస్తీర్ణాన్ని బట్టి వరి, ఇతర పంటలతో కలుపుకుని మొత్తం 5 వేల క్వింటాళ్ల విత్తనాలు అవసరం అవుతాయని జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు ఉన్నతాధికారులకు నివేదిక పంపించారు.

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

- పొంచి ఉన్న ప్రమాదం

మారేడుపల్లి మే 22 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ బోర్డు 4వ వార్డు పరిధిఓలని పికెట్ బస్తీలో ఏర్పాటు చేసిన కంచలేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లతో స్థానికులకు ప్రమాదం పొంచి ఉంది. కార్ఖానా విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని లక్ష్మీనగర్ బస్తీలో పది సంవ్సరాల క్రితం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి స్తంభాలకు అనుసంధానంగా ఏర్పాటు చేసిన విద్యుత్ వైర్లు తెగి ఆ పక్కనే ఇంటిముందు కూర్చుని ఉన్న ఓ వ్యక్తిపై తెగిపడడంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ ప్రహరీ కంచెను ఏర్పాటు చేయవలసిన అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. స్థానికులు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, కేబుల్ వైర్ల వద్దకు వచ్చి తడి, పొడి, చెత్తను వేస్తున్నారు. ఈ క్రమంలో విద్యుత్ షాక్‌కు స్థానిక ప్రజలు గురయ్యే ప్రమాదం పొంచి ఉంది. మారేడుపల్లి సబ్ స్టేషన్ పరిధిలోకి, వచ్చే బ్యాంక్ కాలనీలోని స్పోర్ట్స్ శిక్షణా తరగతుల పక్కనే ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. కింది భూభాగం నుంచి పై స్తంభం వరకు ఏర్పాటు చేసిన విద్యుత్ వైర్లు, తీగలను చూసి స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ఒక్కోసారి విద్యుత్ తీగలు, వైర్లు కలిసిపోయి నిప్పురవ్వలు పడుతున్నాయి. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ నివారణ చర్యల్లో భాగంగా ప్రహరీ కంచెలను ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు, కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు. అసలే వేసవికాలం ముగిసి వర్షాకాలం మొదలవుతున్న తరుణంలో వడగళ్లవానలు, ఈదురు గాలులు, వీస్తుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ప్రజలు జంకుతున్నారు. ప్రమాదకరంగా మారి ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ప్రాంతాల మీదుగా రాకపోకలు సాగించే వాహనదారులు, పాదచారులు, భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ ప్రహరీ కంచెను ఏర్పాటు చేయడంతోపాటు చెత్తాచెదారం వేయకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



పికెట్ లక్ష్మీనగర్ బస్తీలోని ప్రహరీ కంచె లేకుండా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు



మారేడుపల్లి బ్యాంక్ కాలనీలో ఒకేచోట ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

నర్సాపూర్‌లో మహారాష్ట్ర పోలీసుల సోదాలు

- నిషేధిత ద్రవ మత్తు పదార్థం, తయారీ సామగ్రి స్వాధీనం
- పోలీసులు వచ్చారన్న సమాచారంతో కీలక వ్యక్తి పరార్
- కుటుంబ సభ్యుల్లో ఒకరిని విచారించి వదిలేసిన పోలీసులు
- కలకలం రేపిన సంఘటన

మర్పల్లి, మే 22 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు రామేశ్వరం కెఫే బాంబు పేలుళ్లకు సంబంధం ఉందని అనుమానిస్తున్న ఓ వ్యక్తిని వికారాబాద్ జిల్లా కేంద్రంలో ఎన్ఐఏ అధికారులు అదుపులోకి తీసుకున్న సంఘటన మరువకముందే మర్పల్లి మండలం, నర్సాపూర్ శివారులోని ఓ రహస్య స్థలంలో నిషేధిత మత్తు పదార్థాలు తయారు చేస్తున్నారనే సమాచారంతో మహారాష్ట్ర పోలీసులు సోదాలు నిర్వహించడం కలకలం రేపింది. నర్సాపూర్ గ్రామంలో చెరువు పక్కనే ఉన్న ఓ వ్యవసాయ క్షేత్రంలో నిషేధిత మత్తు పదార్థాలు తయారు చేస్తున్నారనే సమాచారంతో మహారాష్ట్ర పోలీసులు బుధవారం తెల్లవారుజామున ఆకస్మికంగా సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో మహారాష్ట్ర పోలీసులు రేకుల షెడ్డులో మూడు లీటర్ల వరకు ద్రవ మత్తు పదార్థంతో పాటు నిషేధిత మత్తు పదార్థాలు తయారు చేసే సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది.. సంఘటనా స్థలంలో స్వాధీనం చేసుకున్న సామగ్రి వివరాలను వారు తమ ఉన్నతాధికారులకు వివరించినట్లు చెబుతున్నారు. సంఘటనా స్థలం ఏ సర్వే నెంబర్‌లోకి వస్తుంది, యజమాని ఎవరు అనే సమాచారం కోసం మహారాష్ట్ర పోలీసులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం అధికారులను సంప్రదించి వివరాలు సేకరించారు. నర్సాపూర్ గ్రామంలోని సర్వే నెం.48లో ఉన్న పొలంలో రేకుల షెడ్డులో కొన్ని రోజులుగా నిషేధిత మత్తు పదార్థాలు తయారు చేస్తున్నారనే సమాచారం తోనే మహారాష్ట్రకు చెందిన థానే పోలీసులు ఇక్కడకు వచ్చినట్లు తెలుస్తోంది. మత్తు పదార్థాలు సరఫరా చేసే వ్యక్తుల ద్వారా రాబట్టిన సమచారం మేరకే మహారాష్ట్ర పోలీసులు ఇక్కడకు వచ్చినట్లు చెబుతున్నారు. ఇదిలా ఉంటే, రేకుల షెడ్డు వద్దకు పోలీసులు వచ్చిన విషయాన్ని పసిగట్టిన అక్కడున్న ఓ వ్యక్తి చెరువులో దూకి అక్కడి నుంచి పారిపోయినట్లు తెలుస్తోంది. కాగా, పారిపోయిన వ్యక్తి కుటుంబ సభ్యుల్లో ఒకరిని పోలీసులు అదుపులోకి తీసుకుని కొంత సమాచారం సేకరించి అతడిని వదిలేశారు. తాము విచారణకు హాజరు కావాలని సమాచారం ఇచ్చినప్పుడు రావాలంటూ స్పష్టం చేసినట్లు తెలిసింది. ఇదిలా ఉంటే, రేకుల షెడ్డులో స్వాధీనం చేసుకున్న సామగ్రిని ఓ వాహనంలో తమ వెంట మహారాష్ట్రకు తరలించారు. ఈ సంఘటనపై జిల్లా, స్థానిక పోలీసులకు సమాచారం లేకపోవడం గమనార్హం.



నర్సాపూర్‌లో ఉన్న రేకుల షెడ్డు



ఎంఈఓ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

గుర్తింపు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

మల్కాజిగిరి, మే 22 (ఆంధ్రజ్యోతి): గుర్తింపు లేని పాఠశాలలపై విద్యాశాఖ చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. జిల్లా ప్రధాన కార్యదర్శి రాథోడ్ సంతోష్ ఆధ్వర్యంలో పలువురు ఎస్ఎఫ్ఐ విద్యార్థి నేతలు బుధవారం మల్కాజిగిరి మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. విద్యాసంవత్సరం ప్రారంభం కాకముందే కార్పొరేట్ పాఠశాలలు అడ్మిషన్ల పేరిట లక్షల రూపాయల ఫీజులను విద్యార్థుల నుంచి వసూలు చేస్తున్నా విద్యా శాఖ పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనుమతి లేకుండా కొనసాగుతున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవడంలో విద్యాశాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. గుర్తింపు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రాన్ని ఎంఈవో కార్యాలయంలో సీఆర్పీ మధులతకు అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థి నేతలు అరుణ్, శ్యాంరావు, శ్రీను, శ్రీకాంత్ పాల్గొన్నారు.